శనివారం 06-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 386, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com





## భారత సైన్యం చేతిలో కొత్త గన్ ఏకే-203

వివరాలు 2లో



## భోలే బాబా అత్యంత విలాస బాబా

వివరాలు 3లో




## మీ ఫోన్ పోతే ఫోన్ పే, గూగుల్ పే ఎలా..?

వివరాలు 4లో



## కల్కి 2898 సినిమా రూ.1000 కోట్లను చేరుతుందా?

వివరాలు 5లో

# నీట్ పరీక్షను రద్దు చేయలేం

- భారీ స్థాయిలో అక్రమాలు జరగలేదు
- సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్



ముందడుగు ఢిల్లీ:
నీట్ పరీక్షను రద్దు చేయడం హేతుబద్ధం కాదని.. ఈ చర్య నిజాయతీ కలిగిన అభ్యర్థుల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. పారదర్శకంగానే పోటీ పరీక్షల నిర్వహణకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొంది. నీట్ అక్రమాలపై సీబీఐతో సమగ్ర దర్యాప్తునకు ఆదేశించామన్న కేంద్రం.. భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు ఆధారాల్లేవని తెలిపింది. అలాంటప్పుడు మొత్తం పరీక్షను, ఇప్పటికే ఫలితాలు విడుదలైన ఫలితాలను రద్దు చేయడం సహేతుకం కాదని అఫిడవిట్‌లో పేర్కొంది. నీట్‌ను రద్దు చేస్తే నిజాయతీగా పరీక్ష రాసిన లక్షల మంది నష్టపోతారని తెలిపింది. దేశంలోని వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు మే 5న నిర్వహించిన నీట్-యూజీ 2024 మిగతా 2లో



## హాథ్రస్ కుటుంబాలను పరామర్శించిన రాహుల్

### అండగా ఉంటామని బాధితులకు భరోసా

ముందడుగు ఉత్తరప్రదేశ్:
ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్‌లో భోలే బాబా సత్సంగ్ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన బాధిత కుటుంబాలను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ ఉదయం ఢిల్లీ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరిన రాహుల్ గాంధీ తొలుత అలీగఢ్ చేరుకున్నారు. అక్కడ బాధితుల ఇళ్లకు వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం హాథ్రస్ చేరుకుని తొక్కిసలాట బాధితులను పరామర్శించారు. ఆయన వెంట యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్, పార్టీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ తదితరులు ఉన్నారు.

## కార్యక్రమ నిర్వాహకులదే తప్పిదం


- సీఎం యోగికి ఇప్పటికే నివేదిక సమర్పించాం
- ఉత్తర్‌ప్రదేశ్ హాథ్రస్ ఘటనపై సిట్ చీఫ్

ముందడుగు ఉత్తరప్రదేశ్:
భోలే బాబా సత్సంగ్ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట ఘటన 121 మందిని బలిగొంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం తన విచారణను వేగవంతం చేసింది. ఇప్పటివరకు 90 మంది వాంగ్మూలాలను నమోదు చేసినట్లు సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఏడీజీ అనుపమ్ కురుక్షేత్ర తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులదే తప్పిదమని మిగతా 2లో



## ఆరు రోజుల్లోనే 1.30 లక్షల భక్తులు దర్శనం

### అమర్‌నాథ్ యాత్రకు భారీగా వస్తున్న భక్తులు



ముందడుగు అమర్‌నాథ్:
ప్రముఖ పుణ్యక్షేత్రం అమర్‌నాథ్ గుహలో ఆ పరమ శివుడిని సందర్శించే వారి సంఖ్య రోజు రోజుకి భారీగా పెరిగిపోతుంది. యాత్ర ప్రారంభమైన కేవలం ఆరు రోజుల్లోనే రికార్డు స్థాయిలో దాదాపు మిగతా 2లో

ముందడుగు
శనివారం, 06-7-2024, హైదరాబాద్

# నీట్ పరీక్షను రద్దు చేయలేం

మొదటిపేజీ తరువాయి

పరీక్షలో అవకతవకలు, లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ కొత్తగా నిర్వహించాలనే డిమాండ్లు వస్తున్న విషయం తెలిసిందే. నీట్ అభ్యర్థుల్లో 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం, ఓఎంఆర్ షీట్లు అందకపోవడం, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు సహా నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్లతో సుప్రీం కోర్టులో దాదాపు 26 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం జులై 8న విచారించనుంది. పలు కోచింగ్ సెంటర్లు, నీట్ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు సమాధానం కోరుతూ ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. మరోవైపు, నీట్ పరీక్ష రద్దు చేయొద్దని కోరుతూ గురువారం 56 మంది నీట్ ర్యాంకర్లు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జులై 8న సీజేఐ ధర్మాసనం విచారణ జరపనుంది.

# కార్యక్రమ నిర్వాహకులదే తప్పిదం

మొదటిపేజీ తరువాయి

ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు సూచిస్తున్నాయని పీటీఐ వార్తాసంస్థకు వెల్లడించారు. తొక్కిసలాట ఘటనపై రూపొందించిన ప్రాథమిక నివేదికను సీఎం యోగి ఆదిత్య నాథ్‌కు ఇప్పటికే సమర్పించాం. హాథ్రస్ డీఎం ఆశీష్ కుమార్, ఎస్పీ నిపుణ్ అగర్వాల్, ఇతర అధికారుల స్టేట్‌మెంట్‌లను ఇందులో పొందుపర్చాం. కేసులో పూర్తిస్థాయి దర్యాప్తును ముమ్మరం చేశాం. ఇప్పటి వరకు సేకరించిన సాక్ష్యాధారాలు.. నిర్వాహకుల అపరాధాన్ని సూచిస్తున్నాయి" అని ఏడీజీ తెలిపారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. భోలే బాబా ఆచూకీ లభించాల్సి ఉంది. కేసులో ఆయన్ని నిందితుడిగా చేర్చలేదని అలీగఢ్ ఐజీ శాలభ్ మాథుర్ గురువారం తెలిపారు.

# భారత సైన్యం చేతిలో కొత్త గన్ ఏకే-203

## నిమిషంలో 700 బుల్లెట్లను కాల్చగలదు ■ చిన్నగా, తేలికగా బరువు తక్కువగా ఉండే రైఫిల్

ముందడుగు జాతీయం:

భారత్-రష్యా జాయింట్ వెంచర్ అయిన ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్ఆర్‌పీఎల్) 35 వేల ఏకే-203 కలాష్నికోవ్ అసాల్ట్ రైఫిళ్లను భారత సైన్యానికి అందజేసింది. భారతదేశం సమీకరించిన కలాష్నికోవ్ ఏకే-203 అసాల్ట్ రైఫిల్స్‌ను ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ జిల్లాలో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో తయారు చేశారు. భారత్-రష్యా మధ్య ఒప్పందం భారతదేశంలో ఏకే-203 రైఫిల్స్ ఉత్పత్తిని నిర్ధారించడమే కాకుండా విస్తృతమైన సాంకేతికత బదిలీని కలిగి ఉంటుంది. అమేథీలోని ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 6 లక్షల 70 వేల రైఫిళ్లను తయారు చేసేందుకు ఆర్డర్ పొందింది. ఉత్తరప్రదేశ్‌లో అమేథీలోని కోర్వా ఆర్డినెన్స్




ఫ్యాక్టరీలో ఉత్పత్తి సౌకర్యాలు పూర్తిగా అత్యాధునిక యంత్రాలు, సాంకేతికతతో ఉన్నాయి. ఇప్పుడు నాణ్యమైన అసాల్ట్ రైఫిల్స్ తయారీ శరవేగంగా జరుగుతోంది. ఈ సౌకర్యాల ఏర్పాటులో భారతీయ, రష్యా సంస్థల మధ్య సహకారం ముఖ్యమైనది. ఏకే-203 రైఫిల్ ఏకే సిరీస్‌లో అత్యంత ప్రాణాంతకమైన, ఆధునిక రైఫిల్. యుద్ధభూమిలో సైనికుడికి కావాల్సిన అన్ని ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఏకే-203 బరువు కేవలం 3.8 కిలోలు కాగా.. కేవలం 705 మిమీ పొడవు మాత్రమే. చిన్నగా, తేలికగా ఉండటం వల్ల ఎక్కువసేపు మోసుకెళ్లినా అలసట ఉండదు. ఏకే-203 రైఫిల్ 7.62×39మిమీ బుల్లెట్లను కాలుస్తుంది. 800 మీటర్ల పరిధిని కలిగి ఉంటుంది. అంటే ఏకే-203 పరిధిలోకి వస్తే శత్రువులెవరైనా తప్పించుకోవడం కష్టమే. ఈ రైఫిల్ ఒక నిమిషంలో 700 బుల్లెట్లను కాల్చగలదు. ఏకే-203 రైఫిల్‌లో 30 రౌండ్ల బాక్స్ మ్యాగజైన్ ఉంది. ఇదొక్కటే కాదు, శత్రువును దూరం నుండి బైనాక్యులర్స్ ద్వారా చూసేందుకు కూడా ప్రత్యేకంగా రూపొందించారు. ఈ ప్రత్యేకత మరింత ప్రాణాంతకం చేస్తుంది. వాస్తవానికి, ఇతర అసాల్ట్ రైఫిల్స్‌లో నిర్దిష్ట రకమైన టెలిస్కోప్‌ను మాత్రమే అమర్చవచ్చు, అయితే ప్రపంచంలోని ఏ టెలిస్కోప్‌నైనా ఏకే-203లో అమర్చవచ్చు.

# ఆరు రోజుల్లోనే 1. 30 లక్షల భక్తులు దర్శనం

మొదటిపేజీ తరువాయి

1. 30 లక్షల కంటే ఎక్కువ మంది భక్తులు మంచు రూపంలో ఉన్న శివలింగాన్ని దర్శించుకున్నారు. గురువారం ఒక్క రోజే 24 వేల మంది యాత్రికులు ఆ పరమేశ్వరుడిని దర్శనం చేసుకోగా.. బుధవారం 30 వేల మందికి పైగా భక్తులు నీలకంఠుడిని దర్శించుకునేందుకు వచ్చారు. శుక్రవారం ఉదయం ఎనిమిదో బ్యాచ్‌లో 6, 919 మంది యాత్రికులు జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ బేస్ క్యాంప్ నుంచి సెంట్రల్ కశ్మీర్‌లోని గందర్‌బాల్ జిల్లాలోని బల్తాల్, అనంత్‌నాగ్ జిల్లాలోని నున్వాన్-పహల్గామ్ జంట బేస్ క్యాంపుల వైపు కట్టుదిట్టమైన భద్రతా చర్యల మధ్య బయలుదేరి వెళ్లారు. జమ్మూ అండ్ కశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో అమర్ నాథ్ యాత్ర మార్గంలో అడుగడుగున



భద్రతా దళాలను భారీగా మోహరించాయి. ఈ ఏడాది జూన్ 29న ప్రారంభమైన ఈ యాత్ర ఆగస్టు 19వ తేదీతో దాదాపు 52 రోజుల పాటు కొనసాగనుంది. గత ఏడాది 2023లో 4.5 లక్షల మందికి పైగా భక్తులు అమర్‌నాథ్ యాత్రకు వచ్చారు.. కానీ, ఈ సారి అంతకంటే ఎక్కువ మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు.

# అమ్మకానికి ఎయిర్‌టెల్ యూజర్ల డేటా

## తప్పుడు ప్రచారమే అంటున్న ఎయిర్‌టెల్

ముందడుగు జాతీయం:

భారతదేశంలో 37.5 కోట్ల మంది ఎయిర్‌టెల్ యూజర్ల వ్యక్తిగత వివరాలు డార్క్ వెబ్‌లో అమ్మకానికి ఉందని ఓ హ్యాకర్ చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా సంచనలంగా మారింది. దేశంలోనే అతిపెద్ద టెలికాసం సంస్థల్లో ఒకటైనా ఎయిర్‌టెల్ యూజర్ల డేటా లీక్ అయ్యిందన్న అందరినీ కలవరానికి గురి చేశాయి. 'ఎక్స్‌జెన్' అనే పేరుతో సదరు హ్యాకర్ 37.5 కోట్ల మంది ఎయిర్‌టెల్ ఇండియా యూజర్ల మొబైల్ నెంబర్లు, పుట్టిన తేదీ, తండ్రిపేరు, ఆధార్ కార్డు వివరాలు, ఈమెయిల్ ఐడీ వంటి వివరాలతో కూడా డేటా బేస్‌ను రూ. 41 లక్షలకు అమ్మకానికి పెట్టినట్లు ప్రకటించాడు. దీంతో దీనిపై ఎయిర్‌టెల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదంతా తప్పుడు ప్రచారమేనని కొట్టి పడేసింది. దీనిపై తాము క్షుణ్ణంగా దర్యాప్తు చేశామని, ఎయిర్‌టెల్ సిస్టమ్‌లో ఎలాంటి





ఉల్లంఘన జరగలేదని తేల్చి చెప్పారు. ఇది ముమ్మాటికీ తప్పడు ప్రచారమని, యూజర్లు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎయిర్ టెల్ తెలిపింది. అయితే హ్యాకర్ మాత్రం జూన్‌లోనే ఈ డేటా లీక్ జరిగినట్లు చెబుతున్నాడు. డేటా నమూనాను కూడా షేర్ చేసినట్లు చెప్పాడు. అంతేకాకుండా కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ నిర్వహించే దౌత్యవేత్త పాస్‌పోర్ట్ హోల్డర్స్ డేటాబేస్‌ను లక్ష్యంగా చేసుకొని, గతంలో జరిగిన ఉల్లంఘనలో కూడా ఎక్స్‌జెన్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

# బ్రిటన్ ఎన్నికల్లో ఏఐ అభ్యర్థి పోటీ

## కేవలం 179 ఓట్లు మాత్రమే సాధించింది

ముందడుగు బ్రిటన్:

బ్రిటన్ లో జరిగిన ఎన్నికల్లో సరికొత్త సాంకేతికత కృత్రిమమేధ కూడా బరిలో నిలిచింది. 'ఏఐ స్టీవ్' పేరిట ప్రజల నుంచి ఓట్లను కోరింది. ఈ రాజకీయరంగ ప్రవేశం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైనప్పటికీ.. ఓటర్లు మాత్రం ఈ స్టీవ్‌పై పెద్దగా ఆసక్తి కనబర్చలేదు. కేవలం 179 మంది మాత్రమే ఆ అభ్యర్థికి ఓటువేశారు. దాంతో 'బ్రైటన్ పవిలియన్' నియోజకవర్గంలో చివరి స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. వర్చువల్ అసిస్టెంట్లు, ఆటోమేటెడ్ కస్టమర్ సర్వీస్ ఏజెంట్ల నుంచి న్యూస్ యాంకర్లు, వర్చువల్ టీచర్ల వరకు ఈ కృత్రిమ మేధ సాంకేతికత అన్నింటా అద్భుతమైన పనులు చేసేస్తోంది.



ఈ నేపథ్యంలోనే వ్యాపారవేత్త స్టీవ్ కాట్‌కు తన స్థానంలో ఏఐ అభ్యర్థిని నిలబెట్టాలనే ఆలోచన వచ్చింది. దీంతో తన ఫొటో సాయంతో రూపొందించిన ఏఐ అవతార్‌ను వినియోగించారు. 'ఏఐ స్టీవ్' పేరుతో నామినేషన్ సమర్పించి ఎన్నికల బరిలోకి దిగారు. ఈ వర్చువల్ అభ్యర్థి కాట్ తరపున నిల్చుంది. ప్రచారంలో పాల్గొంది.

# భోలే బాబా అత్యంత విలాస బాబా

- దేశవ్యాప్తంగా 24 ఆశ్రమాలు
- రూ.100 కోట్ల వరకు ఉన్న ఆస్తులు
- 16 మంది వ్యక్తిగత కమాండోలు
- ఆయన కారుక ముందు 350 సీసీ బైక్‌లు



ముందడుగు ఉత్తరప్రదేశ్:
ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లాలో జరిగిన తొక్కిసలాటకు కేంద్ర బిందువుగా మారిన భోలే బాబాకు సంబంధించి ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయన ఆస్తులు, విలాసాలపై ఓ జాతీయ మీడియా ఛానెల్ విస్తుపోయే నిజాలు వెల్లడించింది. ఆయన ఆశ్రమంలోని విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం సేకరించినట్లు వెల్లడించింది.

భోలే బాబాకు దేశవ్యాప్తంగా 24 ఆశ్రమాలు ఉన్నాయని సమాచారం. వీటిలో అత్యధికంగా యూపీలోనే ఉన్నాయి. ఆయన ఆస్తుల విలువ దాదాపు రూ.100 కోట్ల వరకు ఉంటుందని ఆశ్రమంలో విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. శ్రీ నారాయణ్ హరి సాకార్ ఛారిటబుల్ ట్రస్ట్ పేరిట వీటిని నిర్వహిస్తున్నారు. ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండేవాళ్లే వీటి నిర్వహణ కార్యకలాపాలు చూస్తుంటారు. నిత్యం తెలుపు రంగు దుస్తులు, టై, కళ్లద్దాల్లో కనిపించే ఆయన అనుచరులకు దర్శనమిచ్చే సమయంలో భారీ పరేడ్‌తో వస్తారు. దాదాపు 16 మంది వ్యక్తిగత కమాండోలు ఆయన కారుకు ముందు 350 సీసీ బైక్‌లపై ప్రయాణిస్తూ దారిని క్లియర్ చేస్తారు. వెనక 15-30 కార్లతో ఆయన కాన్వాయ్ ఉంటుంది. దీంట్లో తెల్లటి టయోటా ఫార్చునర్ కారులో ఆయన ప్రయాణిస్తారు. కారు సీట్లతో సహా ఇంటీరియర్ సైతం పూర్తిగా తెలుపు రంగులో ఉంటుందని ఆయన అనుచరుల్లో కొంతమంది తెలిపారు.

సూరజ్‌పాల్ మెయిన్‌పురిలోని ఆశ్రమంలో నివాసముంటారు. హరి నగర్‌గా పిలిచే ఈ ఆశ్రమం 13 ఎకరాల్లో విస్తరించి ఉంది. భోలే బాబా, ఆయన భార్య కోసం అందులో దాదాపు ఆరు విలాసవంతమైన గదులు ఉంటాయని సమాచారం. ఆశ్రమంలోకి ప్రవేశిస్తుండగానే దానికి విరాళాలిచ్చిన 200 మంది పేర్లు కనిపిస్తాయని తెలుస్తోంది. వాటిపై రూ.10 వేల నుంచి రూ.2.5 లక్షల వరకు ఇచ్చిన దాతల వివరాలు ఉంటాయని సమాచారం. ఇటావాలో మరో కొత్త ఆశ్రమం నిర్మాణంలో ఉంది.

## చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు

### ఆట వస్తువులు, స్టేషనరీ, తినుబండారాలు పంపిణీ




ముందడుగు హైదరాబాద్:
స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆట వస్తువులు, స్టేషనరీ, తినుబండారాలను అందించి రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న సంచార జాతుల కుటుంబాల చిన్నారులకు జన్మదిన వేడుకలను నిర్వహించి అక్షర అబ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్కై ఫౌండేషన్ నిరంతరంగా విభిన్న సేవ కార్యక్రమాలు కొనసాగిస్తూ ఎందరికో ఆదర్శంగా ఉంటున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు హరీష్ కుమార్, అఖిల్, శుభం, గౌతమ్. శివ, సిద్దార్థ, వితేశ్, వంశీ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, శిరీష, ఝూసినా బేగం తదితరులు పాల్గొన్నారు.




## గంజాయి సేవిస్తున్న మెడికల్ విద్యార్థులు

### ఉస్మానియా మెడికల్ కాలేజీలో గంజాయి కలకలం



ముందడుగు హైదరాబాద్:
గంజాయి రోజురోజుకు విస్తరిస్తోంది. పల్లెలు, పట్టణాలకు వ్యాపిస్తోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో గంజాయి కలకలం రేపింది. ఆరుగురు మెడికోలు గంజాయి సేవిస్తున్నట్లుగా గుర్తించారు. వీరిలో ఇద్దరు మెడికోలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఇద్దరు డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేశారు. విద్యార్థులకు సురేష్ సింగ్ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. అతని నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



## బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

ముందడుగు ములుగు:
నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతున్న బిజెవైఎం నాయకులను అక్రమ అరెస్టులతో నిర్బంధించి ఉద్యమాన్ని ఆపలేరని బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం అన్నారు. కలెక్టరేట్ ముట్టడికి హాజరైన ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పటివరకు ఎటువంటి జాబ్ నోటిఫికేషన్ లు లేక ఎంతో మంది యువతీ యువకులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి నిరుద్యోగుల కోసం 25000 ఉద్యోగాలతో మెగా డీఎస్సీ వేయాలని, గ్రూప్ 2మరియు గ్రూప్ 3లో ఎక్కువ మొత్తంలో నోటిఫికేషన్ లు వేయాలని, జాబ్ నోటిఫికేషన్ వేయాలని బీజేవైఎం డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్,పాలసి మరియు రీసెర్చ్ కన్వీనర్ భూక్యా రాజు నాయక్,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రవీంద్ర చారీ,నగరపు రమేష్,ఉపాధ్యక్షులు అడపా బిక్షపతి,జినుకలా కృష్ణాకర్ రావు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాయంచు నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్ డిపో నిర్మాణం కొరకు ప్రతిపాదనలు

### ములుగు జిల్లా కలెక్టర్ దివాకర



ముందడుగు ములుగు:
ఆర్టీసీ బస్ డిపో నిర్మాణం కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ఆర్టీసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఏటూరు నాగారం మండల కేంద్రంలో పాత టీజీ ఆర్టీసీ బస్టాండ్ ను ఆర్టీసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిపోలో కావలసిన బంకు, వాహనాల సర్వీసింగ్ షెడ్, సీసీ రోడ్డు తదితర డిజనింగ్ నమూనా ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన సమర్పించాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో టి.జి.ఆర్టీసీ ఈ ఈ భాస్కర్, డి ఎం సురేష్, డి.టి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

ముందడుగు
శనివారం, 06-7-2024, హైదరాబాద్

# ప్రజలకు సేవ చేయడం ఒక వరం

## వెంకటాపూర్ ఎంపీటీసీ2 పోశాల అనిత వీరమల్లు



ముందడుగు వెంకటాపూర్:
ప్రజలకు సేవ చేయడం ఒక వరమని వెంకటాపూర్-2 ఎంపీటీసీ పోశాల అనిత -వీరమల్లు గౌడ్ పేర్కొన్నారు. గడచిన ఐదు సంవత్సరాల ఎంపీటీసీ పదవి కాలం ఎంతో సంతృప్తినిచ్చిందని భావోద్వేగంగా అన్నారు. 2019 ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుండివెంకటాపూర్ ఎంపీటీసీ -2 గెలిచామన్నారు. అనంతరం ఎంపీటీసీగా ప్రమాణ స్వీకారం చేసి, ప్రభుత్వం నుండి వచ్చిన పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజల మన్నలను పొందాను అని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి వచ్చిన నిధులతోనే కాకుండా మా సొంత నిధులతో కూడా అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. వెంకటాపూర్ ఎంపీటీసీ -2గా ఐదు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకొని అభివృద్ధికి బాటలు వేసిన పోశాల అనిత వీరమల్లు గౌడ్ కి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్ర భద్రయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మేడ బోయిన అశోక్, పిఎసిఎస్ చైర్మన్ కాసర్ల కుమారస్వామి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దగ్గు ప్రభాకర్ రావు, తదితర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీ ఫోన్ పోతే ఫోన్ పే, గూగుల్ పే ఎలా..?

## యూపీఐ ఐడీలు ఏమవుతాయి ▪వాటిని ఎలా బ్లాక్ చెయోచ్చో తెలుసుకోండి

ముందడుగు ప్రత్యేకం:
భారత్‌లో 2016 నుంచి యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం దేశంలో భారీగా యూపీపై చెల్లింపులు జరుగుతున్నాయి. 2024 మే నెలలో విడుదల చేసిన నివేదిక ప్రకారం భారత్‌లో యూపీఐ ద్వారా 14.02 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. ఇతర దేశాల్లో కూడా ఈ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇదిలా ఉంటే స్మార్ట్ ఫోన్‌ను ఎక్కడైనా పడిపోయినా.? లేదా ఎవరైనా దొంగలించినా.? యూపీఐ ఐడీలను ఎలా బ్లాక్ చేసుకోవాలో ఎప్పుడైనా ఆలోచించారా.? వెంటనే యూపీఐ ఐడీలను ఎలా బ్లాక్ చేయాలో ఇప్పుడు ఒకసారి తెలుసుకుందాం..




### గూగుల్ పే ఐడి..

మీరు ఒకవేళ గూగుల్ పేను బ్లాక్ చేయాలనుకుంటే ముందుగా మరో ఫోన్ నుంచి 18004190157కు డయల్ చేయాలి. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌తో మాట్లాడి ఐడీని బ్లాంక్ చేసుకోవచ్చు. ఇందుకోసం మరీ ఫోన్ నెంబర్‌తో పాటు మరికొన్ని వివరాలను అందించాల్సి ఉంటుంది.

### ఫోన్ పే..

ఫోన్‌పే విషయానికొస్తే.. ఐడీని బ్లాక్ చేయడానికి ముందుగా 02268727374 లేదా 08068727374 నెంబర్‌కు ఇతర ఫోన్‌ను కాల్ చేయాలి. అనంతరం కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌తో మాట్లాడాల్సి ఉంటుంది. మీ రిజిస్టర్ మొబైల్ నెంబర్‌తో పాటు మరికొన్ని వివరాలు తెలిపితే వారు ఫోన్ పే ఐడీని డీ యాక్టివేట్ చేస్తారు.

### పేటీఎమ్..

ఇక పేటీఎమ్ ఐడీ బ్లాక్ విషయానికొస్తే 01204456456 హెల్ప్ లైన్ నెంబర్‌కు కాల్ చేయాలి. అనంతరం మీ ఫోన్ నెంబర్ ద్వారా పేటీఎమ్ నుంచి లాగవుట్ అవ్వొచ్చు. ఆ తర్వాత పేటీఎమ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అనంతరం 24 X 7 హెల్ప్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత రిపోర్ట్ ఎ ఫ్రాడ్ లేదా మెసేజ్ అస్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అందులో మీ ఫోన్ పోయిన విషయాన్ని తెలియజేస్తే, పేటీఎమ్ ఖాతా తాత్కాలికంగా బ్లాక్ అవుతుంది.

# నిరుద్యోగుల కట్టడికి అడుగడుగునా తనిఖీలు

## ▪టీజీఎస్పీఎస్సీ కార్యాలయం చుట్టు బారికేడ్లు
## ▪అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులు


ముందడుగు హైదరాబాద్:
తెలంగాణ నిరుద్యోగులు హైదరాబాద్‌లోని టీజీఎస్పీఎస్సీ కార్యాలయ ముట్టడికి ఇచ్చిన పిలుపు ఉద్రిక్తంగా మారింది. నిరుద్యోగ యాత్ర పేరుతో తెలంగణ నిరుద్యోగ జేఏసీ ఇచ్చిన పిలుపుతో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్రమత్తమైంది. టీజీఎస్పీఎస్సీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున బలగాలను మోహరించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పికెటింగ్‌లు నిర్వహించగా.. టీజీఎస్పీఎస్సీ కార్యాలయం గేటు ముందు బాహుబలి సినిమాలో యుద్ధం సమయంలో ఏర్పాటు చేసిన.. రక్షణ కవచాన్ని తలపించేలా.. భారీ బారేకేడ్లు ఏర్పాటు చేయటం గమనార్హం. నగరంలోని అన్ని మెట్రో స్టేషన్లలో



కూడా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో.. ముట్టడికి యత్నించిన యువతను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. టీజీఎస్పీఎస్సీ కార్యాలయానికి పెద్ద ఎత్తున యువత చేరుకుని ఆందోళన నిర్వహించగా.. పోలీసులు వాళ్లందరిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. కేవలం టీజీఎస్పీఎస్సీ కార్యాలయం వద్దకు వచ్చిన యువతను మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు నిరుద్యోగ జేఏసీ, బీజేవైఎం నేతలను కూడా పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ముట్టడి నేపథ్యంలో పోలీసులు అత్యుత్సాహం కూడా ప్రదర్శించారు. ఆ రోడ్డు వెంట ఎవరొచ్చినా వాళ్లు ముట్టడికి యత్నిస్తున్నారేమోనని.. అదుపులోకి తీసుకుని.. పోలీసు వాహనాలు ఎక్కించటమే పనిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే.. ఓ భార్యభర్తల జంటను ఆపేసి, ఫోన్లు లాక్కున్నారు. దీంతో.. తాము సాధారణంగా రోడ్డు వెంట వెళ్తున్నామని, ఆందోళన చేయటానికి రాలేదంటూ ఆ జంట ఆగ్రహం వ్యక్తం చేయటంతో.. అక్కడి నుంచి పంపించేశారు.

# వాహనాల నిర్వహణను మెరుగుపరిచే వ్యవస్థ ఏర్పాటు

ముందడుగు హైదరాబాద్:
భారతదేశపు రద్దీగా ఉండే పట్టణ దృశ్యాలు మరియు విభిన్నమైన రహదారి పరిస్థితులు రోజూవారీ రద్దీ నుండి తేలికగా ప్రయాణించే వాహనాలను డిమాండ్ చేస్తున్నాయి. ఎస్ యువీలు, సిడాన్స్ రెండిటి లక్షణాలు గల క్రాస్ ఓవర్స్, రెండు వాహనాల రకాల ఉత్తమమైన ఫీచర్స్ ను కలిగి ఉన్నాయి. వాటి స్టైలిష్ ఎక్స్ టీరియర్స్ కింద క్రాస్ ఓవర్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన సస్పెన్షన్ వ్యవస్థ ఉంది, ఇది వాహనాల నిర్వహణను మెరుగుపరుస్తుంది మరియు సాఫీ రైడ్ కేటాయిస్తుంది. ఇది వాటికి గల స్టైల్, స్థలం, సౌకర్యం, ఆచరణసాధ్యతల మిశ్రమం వలన క్రాస్ ఓవర్స్ ను



భారతదేశపు రహదారుల కోసం ఉత్తమమైనవి ఎంపికగా చేసింది. క్రాస్ ఓవర్స్ సంప్రదాయబద్ధమైన ఎస్ యువీ వ్యవస్థలకు బదులు కార్ ప్లాట్ ఫాంస్ పై రూపొందించబడ్డాయి. ఇవి గణనీయంగా వాటి రైడ్ ను మరియు నిర్వహణ లక్షణాలను మెరుగుపరుస్తాయి. పెద్ద ఎస్ యువీల కంటే ప్రయాణికులు సాఫీ మరియు మరింత సౌకర్యవంతమైన రైడ్ ను ఆనందించవచ్చు. ఇంకా, వాటికి గల తక్కువ గురుత్వాకర్షణ శక్తి వాటిని మరింత స్థిరంగా, సులభంగా డ్రైవ్ చేయడానికి వీలు కల్పిస్తుంది, జాతీయ రహదారులు మరియు నగర వీధుల్లో కూడా ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభవాన్ని నిర్ధారిస్తాయ.

ముందడుగు
శనివారం,
06-7-2024,
హైదరాబాద్

## టీమ్ ఇండియా సాధన పట్ల గర్వపడ్డాను




ముందడుగు హైదరాబాద్:
ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2024 ట్రోఫీని భారత్ గెల్చుకున్న సందర్భంలో శ్రీశాంత్ ఇలా వ్యాఖ్యానించారు: "మనం ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2024 ట్రోఫీని అందుకుని పైకి ఎత్తినప్పుడు, నేను టీమ్ ఇండియా సాధన పట్ల గర్వంతో మునిగిపోయాను. ఈ టోర్నమెంట్‌లో మా ప్రయాణం అసాధారణమైనది కాదు. కఠినమైన, స్థితిస్థాపకతతో కూడిన క్షణాలు చరిత్రలో నిలిచిపోతాయి. ఈ విజయం మనకే కాదు, మన అభిరుచిని, నమ్మకాన్ని పంచుకునే ప్రతిభావంతులైన వ్యక్తుల సమూహానికి నాయకత్వం వహించడం విశేషం. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.

# కల్కి 2898 సినిమా రూ.1000 కోట్లను చేరుతుందా?

కల్కి, ప్రభాస్, నాగ్ అశ్విన్.. ఇప్పుడు ఈ మూడు పేర్లు హాట్‌టాపిక్. ప్రస్తుతం ఎక్కడా విన్నా 'కల్కి 2898 ఏడీ' గురించే చర్చ జరుగుతుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటున్న సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ.1000 కోట్లకు పైగా వసూలు చేస్తుందని అంచనా వేస్తున్నారు ట్రేడ్ పండితులు. అయితే కేవలం విదేశాల్లోనే ఈ చిత్రం రూ.150 కోట్లకు పైగా వసూలు చేస్తుందని చెబుతున్నాయి సినీ వర్గాలు.

ఈ చిత్ర విజయంలో కీలక భూమిక పోషించిన నాగ్ అశ్విన్, ప్రియాంకదత్, స్వప్నదత్‌లు మాత్రం సినిమా కలెక్షన్ల కంటే ముఖ్యంగా ఓ అద్భుతమైన సినిమాను ప్రేక్షకులకు అందించామనే సంతృప్తి మాకు ముఖ్యమని చెబుతున్నారు. ఈ చిత్రం వసూళ్లు ఈ స్థాయిలో వుండటానికి కారణం ప్రభాస్ లాంటి యూనివర్సల్ స్టార్ ఈ సినిమాలో హీరోగా వుండటం,




అమితాబచ్చన్, కమల్‌హాసన్ లాంటి గొప్ప నటులు నటించడం, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే మరో కీలక పాత్రలో కనిపించడం ఇవన్నీ ఒకెత్తు అయితే.. ముఖ్యంగా హాలీవుడ్ స్థాయిలో వున్న ఈ చిత్రం మేకింగ్‌లోని ప్రతి సన్నివేశాన్ని చూసి ప్రేక్షకులు మైమరిచిపోతున్నారు. ముఖ్యంగా చిత్రంలో వున్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్, విజువల్స్ చూసి, తెలుగు సినిమా స్థాయిని ప్రశంసిస్తున్నారు. దీంతో పాటు ఈ చిత్రానికి సమయం కూడా కలిసొచ్చింది. ఈ మధ్య కాలంలో ఇంతటి భారీ స్థాయి సినిమా రాకపోవడంతో పాటు సినిమాకు లాంగ్ వీకెండ్ అడ్వాంటేజీగా మారింది. సినిమాలో కీలకంగా వున్న బుజ్జి కారు, ఇలా సినిమాలో పాటు చిన్నపిల్లల నుండి పెద్ద వాళ్ల వరకు అలరించే అంశాలు ఈ చిత్రంలో వుండటం కూడా మరో కారణం.

యూనివర్శల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు కొత్త అనుభూతిని పంచుతుంది. చాలా కాలం తరువాత థియేటర్లు ప్రేక్షకులతో కళ కళలాడుతున్నాయి. గత కొంతకాలంగా సినిమాలు లేక, సరైన కంటెంట్‌తో సినిమాలు రాక విసిగిపోయిన ప్రేక్షకులకు ఈ సినిమా కొత్త అనుభూతితో పాటు మంచి సినిమా చూశామన్న ఆనందాన్ని ఇచ్చింది. అందుకే ప్రేక్షకులు ఈ చిత్రానికి అత్యంత భారీ విజయాన్ని అందించారు. ఈ కలెక్షన్ల సునామీ రూ.1000 కోట్లకు పైగా చేరుకుంటుందని అందరూ అంచనా వేస్తున్నారు.

## ఇంతకీ రష్మిక మందన్నా ట్రాలీ బ్యాగ్‌లో ఏముంది

### కుబేర ఫస్ట్ లుక్ గ్లింప్స్ వైరల్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న సినిమాల్లో ఒకటి కుబేర. టాలీవుడ్ డైరెక్టర్ శేఖర్‌కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నాడు. ధైర్యవంతులనే అదృష్టం వరిస్తుంది.. అనే క్యాప్షన్‌తో చెదిరిన వెంట్రుకలు, మాసిన గడ్డంతో నవ్వుతూ కనిపిస్తున్న ధనుష్ లుక్‌ను మేకర్స్ ఇప్పటికే విడుదల చేయగా.. సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. తాజాగా రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ గ్లింప్స్ చేశారు. నిర్మానుష్యంగా ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లిన రష్మిక గుంతలో పూడ్చిపెట్టిన ట్రాలీ బ్యాగ్‌ను బయటకు తీయగా.. డబ్బుతో నిండి ఉంది. ఇంతకీ రష్మిక ఆ బ్యాగ్‌ను ఎక్కడికి తీసుకెళ్లిందనేది సస్పెన్స్ నెలకొంది.



ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పీ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోషల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న కుబేర ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవలే ధనుష్, నాగార్జున, రష్మిక టీం ముంబై షెడ్యూల్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. జుహూ బీచ్‌లో ధనుష్‌పై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించగా.. ఈ విజువల్స్ ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో కూడా ధనుష్, అక్కినేని నాగార్జున మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు.

## ఉస్తాద్ భగత్ సింగ్‌పై రూమర్..

### పుకార్లకు చెక్ పెట్టిన హరీష్ శంకర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రాలలో ఒకటి 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమాకు గబ్బర్ సింగ్ ఫేమ్ హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. 2022లోనే మొదలైన ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల వలన వాయిదా పడింది. అయితే ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అని ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రేక్షకులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ మూవీ ఆగిపోయిందంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ వార్తలపై హరీశ్ శంకర్ తాజాగా క్లారిటీ ఇచ్చాడు. ఎక్స్‌లో ఒక నెటిజన్ 'ఉస్తాద్ భగత్ సింగ్' ఆగిపోనుందంటూ పోస్ట్ పెట్టాడు. దీనికి హరీశ్ శంకర్ రిప్లయ్ ఇస్తూ.. 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా స్టార్ట్ కానప్పుడే ఆగిపోయిందంటూ వార్తలు వచ్చాయి. అప్పుడే నేను పట్టించుకోలేదు. ఇప్పుడు ఇలాంటి వాటి గురించి చదివే సమయం కూడా



లేదు. నా దృష్టి ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ ఆ తర్వాత ఉస్తాద్ భగత్ సింగ్ పైనే వుంది' అంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశాడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి 'ఉస్తాద్ భగత్ సింగ్' ని నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.